నీరు.. ఊరు.. బేజారు



పెర్లవారిపాలెం ఆర్వో ప్లాంట్ స్థలాన్ని ఆక్రమించుకుని పరదాలు కట్టిన అక్రమార్కులు



అలంకారప్రాయంగా మారిన దేవినూతల ఆర్వో ప్లాంట్

- మూలన పడిన ఆర్వో ప్లాంట్లు
- చీరాల రూరల్ గ్రామాల్లో దాహార్తి
- పట్టించుకోని అధికారులు

చీరాల టౌన్:

రూరల్ గ్రామాల్లో ఎక్కడా మంచినీటి సమస్యలు రానివ్వం.. ప్రజలందరికీ తాగునీరు అందిస్తామని ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. మంచినీటి కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో రూరల్ గ్రామాల్లో ఉన్న ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. గొంతులను తడుపుకొనేందుకు గ్రామస్తులు బోర్లను, బావులను ఆశ్రయిస్తున్నారు.

దేవినూతల దాహం తీరేనా..?

చీరాల మండలానికి దూరంగా బాపట్ల మండలానికి చేరువగా ఉన్న దేవినూతల గ్రామం ప్రస్తుతం మంచినీటి కోసం తహతహలాడుతోంది. మైనర్ గ్రామ పంచాయతీగా ఉన్న దేవినూతల చీరాల మండలానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. దేవినూతల గ్రామంలో రెండు వేల పైగా జనాభాతో 1295 మంది ఓటర్లున్నారు. గ్రామంలో ఎనిమిది వార్డులున్నాయి. ఈ ఊరిలో మంచినీరు వచ్చే బావుల్లో కేవలం 5 మాత్రమే పనిచేస్తుండగా, చేతి పంపుల్లో సగానికి పైగా మరమ్మతులకు గురయ్యాయి. తాగునీటి కోసం ప్రస్తుతం గ్రామ ప్రజలు అరకొర బావులతో సర్దుకుపోతున్నారు. గ్రామంలో ఉన్న చేతిపంపుల్లో, బావుల్లో నీరు కలుషితంగా ఉండటంతో తాగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సమస్యను నిర్మూలించేందుకు వేటపాలెం మండలం లక్ష్మీపురంలో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను గ్రామప్రజల సౌకర్యార్థం దేవినూతలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ అలంకారప్రాయంగా ఉంది. తీరప్రాంత గ్రామం కావడంతో గ్రామంలోని మంచినీటి చేతిపంపుల నుంచి కొన్నిచోట్ల ఉప్పునీరు రావటంతో ఆ నీటిని తాగలేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

ప్లాంటు తీసేశారు.. స్థలాన్ని అక్రమించుకున్నారు

మండలంలోని బుర్లవారిపాలెం పంచాయతీలోని పెర్లవారిపాలెంలో ఏర్పాటు చేసిన నాందీ వాటర్ ప్లాంట్‌ను కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా తీసేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారు. గ్రామ ప్రజలకు తాగునీటికి బ్బందులు లేకుండా ఉండేందుకు 2012లో గ్రామంలో మంచి నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అయితే మంచినీటి ప్లాంట్ వినియోగంలోకి లేకపోవడంతో అక్రమార్కులు.. కొందరు అధికారులు సాయంతో ప్లాంట్‌ను తీసేసి సామగ్రి అమ్మకాలు కూడా చేశారు. అలానే ప్లాంట్ ఏర్పాటు చేసిన స్థలాన్ని టీడీపీ నాయకులు అధికార పార్టీ అండతో ఆక్రమించుకున్నారు. కానీ గ్రామ, మండల, డివిజన్ స్థాయి పంచాయతీరాజ్, రెవెన్యూ, సచివాలయాల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది. అలానే మండలంలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ చీరాల పట్టణానికి కూతవేటు దూరంలోనే ఉంది. గ్రామ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా గ్రామంలో నాందీ వాటర్ ప్లాంట్‌తో పాటు రూ.12 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ ఆర్వో ప్లాంట్‌లో యంత్ర పరికరాలు మరమ్మతులకు గురి కావడంతో చుక్క మంచినీరు విడుదలై సంవత్సరాలు దాటింది. దీంతో సిపాయిపేట కాలనీవాసులు మంచినీటి కోసం వేటపాలెం మండలం లక్ష్మీపురం నుంచి వస్తున్న మంచి నీటిపై ఆధారపడ్డారు. ఈ ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించకున్నా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలోనే జిల్లా పంచాయతీ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం శూన్యం. అలానే మండలంలోని చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు, నాందీ ప్లాంట్లు మూలన చేరాయి. ఫలితంగా ఆయా గ్రామాల ప్రజలు తాగు నీటి కోసం పాట్లు పడుతున్నారు. మినరల్ వాటర్ క్యాన్ రూ.10 చొప్పున కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు గ్రామంలో ఉన్న చేతి పంపులను, బావులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక వైపు సీజనల్ వ్యాధులు పెరిగి ప్రజలు రోగాలతో అవస్థలు పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కలుషితమైన తాగునీరు తాగడం వలన ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు.

> **సమస్య పరిష్కరిస్తాం**
> మండలంలోని ఏయే గ్రామ పంచాయతీల్లో మంచినీటి ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయో తెలుసుకుంటా. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తా. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా పనిచేస్తా.
> – నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

క్లుప్తంగా

అర్థమయ్యే విధంగా బోధన చేయాలి

చీరాల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధనలు చేయడంతో పాటు బోధనోపకరణాలతో బోధించడంతో సులభంగా అర్థం అవుతుందని ప్రథమ్ కో ఆర్డినేటర్ సుభాని సూచించారు. వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్‌ఎం ప్రయోగాలు, ఆకర్షణీయమమైన చిత్రాలను ప్రదర్శన ఏర్పాటు చేశారు. యాతం సౌజన్య, నర్మద, హరిబాబు, డీఆర్పీలు, ఉపాధ్యాయులున్నారు.

నులిపురుగుల నివారణ సాధ్యం

అద్దంకి రూరల్: ఈనెల 10 నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మనోజ్ అన్నారు. శనివారం మోదేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని శింగరకొండపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాలు వేయించుకునే వారందరినీ యులిక్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వ్యాక్సిన్ కొరత ఉన్నందువల్ల తదుపరి బుధవారం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వైద్యాధికారి శ్రీహర్ష, ఎంపీహెచ్‌ఈవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహ ఏర్పాటు అడ్డుకుంటే సహించం

చీరాల రూరల్: చీరాల గడియార స్తంభం సెంటర్లో ఏర్పాటుచేయ తలపెట్టిన మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణాన్ని ఆపమనడానికి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఎటువంటి అధికారంలేదని, ఈ విషయంలో బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ దగ్గరకు వెళతానని మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు అన్నారు. శనివారం తన ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్‌టీఆర్ విగ్రహం గడియార స్తంభం సెంటర్లో ఏర్పాటు చేసేందుకుగాను మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించిందన్నారు. విగ్రహాల నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం పొందిన తరువాత ఏ అధికారి అనుమతి అవసరం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ ఏక పక్షంగా విగ్రహం ఏర్పాటు చేయడం కుదరదని చెప్పే అధికారం లేదన్నారు. ఇకనుంచి తనకు ఎటువంటి పనులు ఉన్నా తమ పార్టీకి చెందిన ఎంపీ వద్దకు వెళతానని ఆయనతోనే పయనిస్తానని తేల్చి చెప్పారు

అప్పేరు వాగును అభివృద్ధి చేయాలి

ఇంకొల్లు(చినగంజాం): అప్పేరు వాగు పూడిక సమస్య కారణంగా ఇంకొల్లు ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చింతలపాలెం డొంక నుంచి కడవకుదురు రోడ్డు వరకు ఉన్న అప్పేరు వాగు పూర్తిగా పూడిక పెరిగిపోయి ఇబ్బంది ఏర్పడింది. వాగులో జమ్ము, తూటాకు, పిచ్చి మొక్కలు, ముళ్ళపొదలు విపరీతంగా పెరిగిపోయి నీరు ముందుకు పోయేందుకు ఇబ్బంది ఏర్పడింది. వర్షాకాలంలో వాగులో నీరు ముందుకు పోక పోగా చుట్టుపక్కల వ్యవసాయ భూముల్లోకి వర్షపు నీరు చేరుతున్నాయి. వాగులో నీరు ఉధృతంగా ప్రవహించే సమయంలో వ్యవసాయ భూములకు వచ్చి చేరడంతో చేతికంది వచ్చిన పంట దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. అప్పేరు వాగును అభివృద్ధి చేసేందుకు దానిపై రెండు ప్రాంతాల్లో చెక్‌డ్యాంలు సైతం ఏర్పాటు చేసి వాగులో విపరీతంగా పెరిగిన తూటుకాడను, పేరుకు పోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించి పై నుంచి వచ్చే నీటిని ముందుకు పంపించినట్లయితే పంట పొలాలకు ఎంతో మేలు జరుగుతుందని, అలా కాకుండా ఇదే విధంగా కొనసాగితే తాము నష్టపోవడం మినహా ప్రయోజనం ఉండదని వారంటున్నారు. చింతలపాలెం వాగు వద్ద నుంచి కడవకుదురు రోడ్డు వరకు వాగును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై విలేకరులు డ్రైనేజీ శాఖ డీఈ సుబ్బారావును వివరణ అడగగా వాగు ఒకటో మైలు రాయి బ్రిడ్జి వరకు నిధులు మంజూరయ్యాయని, ఇంకొల్లు పరిధిలో అప్పేరు వాగు ఒకటో మైలు రాయి బ్రిడ్జి వరకు రూ. 13.98 లక్షలు, ఎర్రవాగుకు రూ. 12.46 లక్షలు, ముప్పాళ్ళ వాగుకు రూ. 15.19 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎగువ ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను తనకు తెలియజేస్తే పరిశీలించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



అప్పేరు వాగులో పేరుకు పోయిన తూటుకాడ, పిచ్చి మొక్కలు

11న శింగరకొండ దేవస్థానం హుండీ లెక్కింపు

అద్దంకి రూరల్: ఈనెల 11న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండపై వేంచేసి ఉన్న క్షేత్రపాలకుడు లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో కానుకల హుండీ లెక్కించనున్నట్లు ఈవో శనివారం తెలిపారు. కానుకల లెక్కింపులో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు పాల్గొనవచ్చన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం ఆరుద్ర నక్షత్రం ద్వాదశి తిధి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మానాయుడు శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆలయ ప్రాకార నిర్మాణానికి భూమి పూజ

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో కొలువై ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతక స్వామి ఆలయ పశ్చిమ ప్రాకార నిర్మాణానికి శనివారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.7 లక్షల వ్యయంతో నిర్మించనున్న పశ్చిమ ప్రాకార నిర్మాణానికి దాత బత్తుల శ్రీనివాసరావు, సుజాత దంపతులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మూలంరాజ్ రాజ్ కుమార్‌శర్మ, రామేశ్వర గురుకులు, కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో సంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, వేదమంత్రోచ్ఛరణల మధ్య నవధాన్యాలను భూమిలో ఉంచి నాలుగు వేదాలను ఆవాహనం చేశారు. అనంతరం విశేషపూజలు జరిగాయి.



భూమిపూజ చేస్తున్న దంపతులు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

జరుబులవారిపాలెం (కారంచేడు): గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలతో పాటు, ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. బాపట్ల ఎస్పీ వారి ఆదేశాల మేరకు శనివారం రాత్రి ఆయన మండలంలోని జరుబులవారిపాలెం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించామని ఆయన తెలిపారు. రాత్రి సమయాల్లో దొంగతనాలు, మందు బాబుల వీరంగాలు, సరదాగా, కాలక్షేపానికి ఆడే జూదాలు (పేకాట, కోడిపందాలు) వంటి ఆటలు ఆడకుండా ఉండేందుకు నిఘా నేత్రాలను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



జరుబులవారిపాలెంలో పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులు, ఎస్ఐ వెంకట్రావు

మద్యం షాపుల కోసం దరఖాస్తుల స్వీకరణ

పర్చూరు(చినగంజాం): ఇంకొల్లు మండలంలో గౌడ కులస్తులకు కేటాయించిన ఓ మద్యం షాపుకు సంబంధించి 32 దరఖాస్తులు స్వీకరించినట్లు పర్చూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ భుజంగరావు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నూతన మద్యం పాలసీ ప్రకారం ఇంకొల్లు మండలంలో ఒకషాపు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 10 వతేదీ ఉదయం 7. 30కు బాపట్ల కలెక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించే డ్రాకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఎంట్రీ పాస్‌లు కూడా తెచ్చుకోవాలన్నారు.

అద్దంకి రూరల్: గీత కులాల వారు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు సమర్పణ శనివారం సాయంత్రంతో ముగిసినట్లు అద్దంకి ఎక్సైజ్ సీఐ భవాని తెలిపారు. అద్దంకి రూరల్ మండలం నుంచి 9 అప్లికేషన్‌లు, జె. పంగులూరు మండలం నుంచి 9 అప్లికేషన్‌లు వచ్చినట్లు తెలిపారు.



ఎక్సైజ్ సీఐ భుజంగరావు

41 దరఖాస్తులు

చీరాల: చీరాల ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 3 మద్యం షాపులకు సంబంధించి శనివారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి 41 దరఖాస్తులు అందాయని సీఐ పి.నాగేశ్వరరావు తెలిపారు. చీరాల మండలంలోని షాపునకు 12, కారంచేడు మండలంలోని షాపుకు 8, వేటపాలెం మండలంలోని షాపుకు 21 దరఖాస్తులు అందాయన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి తీగ చోరీ

మార్టూరు: వ్యవసాయ భూముల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలో ఉన్న రాగి తీగను చోరీచేసిన విషయమై శనివారం మార్టూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. ఎస్సై షేక్ సైదా వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక దర్శి గ్రామానికి చెందిన రైతులు తాతా నాగేశ్వరరావు, ధూళిపాళ్ల పద్మావతి, వల్లెపు సుబ్బారావు, సత్తెనపల్లి నరసింహారావు పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేసి వాటిలో ఉన్న 36 వేల రూపాయల విలువైన రాగి తీగను చోరీ చేశారు.

సీతారామాలయ ప్రతిష్ఠకు అంకురార్పణ

బల్లికురవ: మండలంలోని పెదఅంబడిపూడి గ్రామంలో సీతారామలక్ష్మణ హనుమత్ సహిత జీవధ్వజ.. శిఖరయంత్ర ప్రతిష్ఠ మహోత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. యాగశాల ప్రవేశం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, దీక్షాధారం, కలశస్థాపన, హోమాలు, విగ్రహాలకు జలాధివాసం చేపట్టారు. ఆదివారం మహాన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సోమవారం ప్రతిష్ఠ మహోత్సవం, అన్నసంతర్పణ, మహా కుంభాభిషేకం చేపడుతున్నట్లు చెప్పారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి 5వ వార్షిక శాంతి కల్యాణం శనివారం వైభవంగా ముగిసింది. వేదపండితులు పి. నవీన్ కుమార్ శర్మ, ఏ. శాయి రామ శర్మ, బృందం చే గణపతి పూజ సుదర్శన హోమం చేపట్టారు. సాయంత్రం కొణిదెన ఆ పంచాయతీలోని గంగపాలెం గ్రామంలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం చేపట్టారు.



కొణిదెనలో సుదర్శన హోమంలో పాల్గొన్న జంటలు

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

అద్దంకి రూరల్: ఐతఈఆర్‌డీ, ఆయుష్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక నంబూరిపాలెంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఆర్. శకుంతల, డాక్టర్ ఏ. కరుణాకర్ శిబిరంలో 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐతఈఆర్‌డీ స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ బత్తుల కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఔషధ మొక్కలు అందజేస్తున్న దృశ్యం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

చినగంజాం: స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు, అర్చకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ నిర్వహించారు.



సీతారామాలయంలో భక్తులు

అద్దంకిలో బీజేపీ సంబరాలు

అద్దంకి రూరల్: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించటంపై అద్దంకి బీజేపీ నాయకులు శనివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బంగ్లారోడ్‌లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. జిల్లా, మండల, నియోజకవర్గ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ సంజీవ్ సూచించారు. శనివారం గ్రామంలోని గాంధీపార్కుసెంటర్, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్ కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రైతుల పేర్లు నమోదు చేసుకోండి

బల్లికురవ: రైతులు గుర్తింపు కార్డుల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి శనివారం తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం సెల్ ఫోన్ నంబర్‌తో ఆయా గ్రామాలోని రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను కలిస్తే నమోదుతో ప్రత్యేక యూనిక్ నంబర్లుతో గుర్తింపు కార్డు ఇస్తారని రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.